నేడు ఇంటర్ ఫలితాలు

గరుగుబిల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షల ఫలితాలు శనివారం విడుదల కానున్నాయి. ఉదయం 11 గంటలకు మంత్రి నారా లోకేష్ విడుదల చేయనున్నట్లు జిల్లా ఇంటర్ అధికారి డి. మంజుల వీణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మన మిత్ర వాట్సాప్ నంబర్ 95523 00009 ద్వారా ఇంటర్ ఫలితాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా హెచ్‌టీటీపీఎస్://ఆర్‌సీఎస్‌యుఐటీఎస్‌బీఐఈ.ఏపీ జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా కూడా తెలుసుకోవచ్చని వెల్లడించారు. కాగా జిల్లాలో ఇంటర్ మీడియట్ విద్యార్థుల ఉత్కంఠకు నేటితో తెరపడనుంది.



వీఆర్ఎస్ ప్రాజెక్టు వద్ద లైనింగ్ పనులు ఇలా..



పెద్దగెడ్డ రిజర్వాయర్ వద్ద నిలిచిన లైనింగ్ పనులు

పనులు పూర్తయితే.. సస్యశ్యామలమే..

- సాగునీటి ప్రాజెక్టుల ఆధునికీకరణకు గడువు పూర్తి
- గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం
- జైకా నిధులున్నా.. బిల్లులు మంజూరు చేయని వైనం
- గత ఐదేళ్లూ నత్తనడకనే సాగిన నిర్మాణాలు
- రైతులకు తప్పని సాగునీటి ఇబ్బందులు
- రాష్ట్ర ప్రభుత్వంపైనే ఆశలు


పార్వతీపురం/ జియ్యమ్మవలస, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల ఆధునికీకరణ పనుల గడువు పూర్తయింది. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ ఏడాదీ సాగునీటి ఇక్కట్లు తప్పేలా లేవని వారు దిగులు చెందుతున్నారు. వాస్తవంగా 'మన్యం'లో సాగునీటి ప్రాజెక్టులు ఎన్నో ఏళ్ల కిందట నిర్మించినవి కావడంతో ప్రధాన స్పిల్‌వే కుడి, ఎడమ ప్రధాన కాలువలు పాడైపోయాయి. దీంతో శివారు భూములకు సాగునీరందని పరిస్థితి నెలకొంది. దీనిని దృష్టిలో పెట్టుకున్న గత టీడీపీ ప్రభుత్వం 2019కు ముందు జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ ఏజెన్సీ (జైకా)తో జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. ప్రాజెక్టుల ఆధునీకరణకు జైకా అంగీ కరించింది. కానీ 2019 తరువాత వచ్చిన వైసీపీ సర్కారు అలసత్వం కారణంగా జైకా నిధులు మంజూరైనా సకాలంలో ప్రాజెక్టుల పనులు పూర్తి చేయించలేకపోయింది. సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. ఈ ఏడాది మార్చితో పనుల గడువు కూడా పూర్తయింది. దీంతో రైతులు తీవ్రంగా మథనపడుతున్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వంపైనే వారు ఆశలు పెట్టుకున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో వేల ఎకరాలకు సాగునీరందించే వట్టిగెడ్డ, వెంగళరాయసాగర్, పెద్దగెడ్డ రిజర్వాయర్లతో పాటు పెదంకలాం ఆనకట్ట ఆధునికీకరణ పనులు చేపట్టాలని 2016-17లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నీటి పారుదలశాఖ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ బృందం ఈ ప్రాజెక్టులను పూర్తి పరిశీలన చేసి నివేదికలు అందించాయి. నాటి ప్రభుత్వం ఇచ్చిన నివేదికలతో 2018లో జపాన్ నుంచి వచ్చిన ఇంజనీరింగ్ బృందం మరోసారి ప్రాజెక్టుల పరిశీలన చేసింది. దీని ఆధారంగా వాటి ఆధునికీకరణ కోసం నిధులు అందించడానికి జైకా అంగీకరించింది. నిధులు మంజూరైనా గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యం కారణంగా పనులు మాత్రం నత్తనడకన జరిగాయి. మరోవైపు జంఝావతి ప్రాజెక్టును గత పాలకులు పూర్తిగా పట్టించుకోవడం మానేశారు. దీంతో బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం మండలాల్లో భూములకు సాగునీరు అందడం లేదు. ప్రస్తుత వేసవికాలంలో ఈ పనులు చేపడితే ఖరీఫ్‌లో ఆయకట్టు రైతులకు సాగునీటి ఇబ్బందులు తప్పుతాయని చెప్పొచ్చు.

పెద్దగెడ్డ ఇలా..


పాచిపెంట మండలంలో ఈ ప్రాజెక్టు ఉంది. దీని పరిధిలో పాచిపెంట మండలంలో 6,039 ఎకరాలు, సాలూరులో 2,839 ఎకరాలు, రామభద్రపురంలో 3,122 ఎకరాలు ఉన్నాయి. ఆధునికీకరణ పనులకు 2019, ఫిబ్రవరి 15లో రూ. 28.18 కోట్లతో పరిపాలన ఆమోదం, 2020, మే 22న సాంకేతిక అనుమతులు లభించాయి. రూ. 23.83 కోట్లతో హైదరా బాద్ తార్నాకకు చెందిన ఎం/ఎస్ జీవీవీ - వైఎంఎం ఆర్ (జేవీ)తో ఆధునికీకరణ చేసేందుకు గాను 2020 జూలై 5న ఒప్పందం జరిగింది. ఈ ప్రాజెక్టు ఆధునికీ కరణకు తుది గడువు 2023 డిసెంబరు 31 గా నిర్ణయిం చారు. అయితే వాస్తవానికి 18 నెలల్లో ఈ పనులు పూర్తి కావాలి. కానీ నిర్ణీత గడువుకు 20 శాతమే జరిగాయి. సుమారు 4.8 కోట్ల మేర పనులు పూర్తయినా బిల్లులు మంజూరు కాలేదు.




తోటపల్లి ప్రాజెక్టు..

తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు ద్వారా పాత ఆయకట్టు 64 వేల ఎకరాలు కలుపుకుని మొత్తంగా 1,95,221 ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉంది. కానీ 1,31,221 ఎకరాలకు మాత్రమే ప్రస్తుతం సాగునీరు అందిస్తున్నారు.

(మిగతా 8వ పేజీలో...)





ఒట్టిగెడ్డ ప్రాజెక్టు..

ఈ ప్రాజెక్టు జియ్యమ్మవలస మండలం తాళ్లడుమ్మ పంచాయతీ రావాడ గ్రామం వద్ద ఉంది. కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా 16,680 ఎకరాలకు సాగునీరందించాలని లక్ష్యంతో దీనిని నిర్మించారు. కానీ శివారు భూములకు సాగునీరందడం లేదు. 2019, ఫిబ్రవరి 8న రూ. 44.85 కోట్లతో ప్రాజెక్టు ఆధునికీకరణ పనులకు పరిపాలన ఆమోదం , 2020, ఆగస్టు 19న సాంకేతిక అనుమతి కూడా లభించింది. దీంతో విజయవాడకు చెందిన శ్రీసాయిలక్ష్మీ కనస్ట్రక్షన్స్‌తో 2021 జనవరి 8న నీటి పారుదలశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఒప్పందం కుదుర్చుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఇప్పటివరకు కేవలం 15 శాతం పనులే జరిగాయి. వాస్తవానికి ఈ ఆధునికీకరణ పనులు 2024, జూలై 7 నాటికి పూర్తి కావల్సి ఉంది. రూ.3.9 కోట్లు పనులు పూర్తయినా.. బిల్లులు చెల్లించలేదు.

నేడు వర్కింగ్ డే..

- పనిచేయనున్న రిజిస్ట్రేషన్ కార్యాలయాలు

పార్వతీపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలన్నీ నేడు పనిచేయనున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ పి.రామలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో శనివారం సెలవు లేదన్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు తమ కార్యాలయాలన్నీ పనిచేయనున్నాయని పేర్కొన్నారు. 12న వర్కింగ్ డే గా ప్రకటిస్తూ స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. క్రయ, విక్రయదారులు ఈ విషయాన్ని గ్రహించి రిజిస్ట్రేషన్లతో పాటు అన్ని సేవలు పొందాలని ఆమె సూచించారు.





సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు

- డీఎంహెచ్‌వో భాస్కరరావు

పార్వతీపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో భాస్కరరావు ఆదేశించారు. మాతా శిశు ఆరోగ్య రక్షణే లక్ష్యంగా పనిచేయాలన్నారు. శుక్రవారం స్థానిక ఎన్జీవో హోంలో ఆశా నోడల్ అధికారులతో ఆయన మాట్లాడుతూ.. గర్భిణులుగా నమోదు చేసినప్పటికీ నుంచి ప్రసవానంతరం వరకు పూర్తిస్థాయిలో ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షలు చేయాలన్నారు. డీటీ ఇంజక్షన్లు వేయాలని, ఐరెన్, కాల్షియం మాత్రలు వేసుకునేలా చూడాలని సూచించారు. గర్భిణుల్లో ఆరోగ్య సమస్యలను సత్వరమే గుర్తించి సమీప ఆసుపత్రులకు తరలించాలని, వారిలో రక్తహీనత నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. పిల్లలకు షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయాలని తెలిపారు. వేసవి జాగ్రత్తలపై అవగాహన కల్పించా లన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం పనికిరాదన్నారు. ప్రతిఒక్కరూ అప్రమత్తగా ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయిలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఆశా కార్యకర్తలకు యూనిఫాంలను అందించారు.

గృహ నిర్మాణాలకు ప్రాధాన్యం

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపడుతున్న గృహ నిర్మాణాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి మండలంలో నెలకు కనీసం 500 ఇళ్ల నిర్మాణాలైనా పూర్తి చేయాలని శుక్రవారం క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. మే నెలలోగా 1600 గృహాలను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. పీఎం ఆవాసయోజన 2.0 కిందలబ్ధిదారులకు అవసరమైన కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాల మంజూరులో తహసీల్దార్లు నిర్లక్ష్యం వహిస్తే సహించబోమన్నారు. చెత్త సంపద కేంద్రాలను వినియోగం లోకి తీసుకురావాలని ప్రత్యేకాధికారులను ఆదేశించారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాత్సవ, సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి, డీఆర్వో హేమలత ఇతర అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

గృహమే వ్యవసాయ క్షేత్రం

- మిద్దెలపై పంటలు
- రసాయనాలు లేకుండా సాగు
- విజయనగరం మహిళల కృషి
- మరికొంతమందికి అవగాహన కల్పించే ప్రయత్నం

6లో



శుద్ధజలం.. మూణ్నాళ్ల ముచ్చటేనా?

- పాఠశాలల్లో మూలకు చేరిన ఆర్వో ప్లాంట్లు
- బోర్లపై ఆధారపడుతున్న విద్యార్థులు

8లో



బీసీల అభ్యున్నతే లక్ష్యం

- జ్యోతిబా పూలే జయంతి సభలో మంత్రి సంధ్యారాణి

పార్వతీపురం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బీసీ అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని , వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మహాత్మ జ్యోతిబా పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం సమావేశ మందిరంలో ఆమె మాట్లాడుతూ.. 'ఇదే నెలలో బాబూ జగ్జీవన్‌రామ్ , జ్యోతిబా పూలే, అంబేడ్కర్ వంటి మహనీయుల జయంత్యుత్సవాలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉంది. వారి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి. బీసీల రక్షణ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయడమే కాకుండా నామినేటెడ్ పోస్టులు, చట్ట సభల్లో 34 శాతం రిజర్వేషన్‌ను కల్పించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుంది. వివిధ కులవృత్తుల వారి కోసం ఆదరణ పథకాన్ని పునరుద్ధరించాం. బీసీ లబ్ధిదారుల గృహ నిర్మాణాల వేగవంతానికి ప్రభుత్వం అదనంగా రూ.50 వేలను అందిస్తోంది. బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు కోసం రూ.900 కోట్ల మేర రుణాలు మంజూరు చేసింది. 50 శాతం సబ్సిడీతో సూర్యఘర్ యోజన పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. గ్రామాల అభివృద్ధిలో భాగంగా సర్పంచ్‌లకు నిధులు కేటాయిం చింది. వెనుకబడిన కుటుంబాల ఆర్థికాభివృద్ధికే ప్రభుత్వం పీ-4 సర్వేకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో 2,929 మంది బీసీ లబ్ధిదారులకు రూ.35 కోట్లు మేర రుణాలను అందిస్తున్నాం.' అని తెలిపారు. అనంతరం 124 మంది లబ్ధిదారులకు రూ.2.71కోట్ల మెగా చెక్కును, వ్యవసాయ, ఇతర పనిముట్లు పంపిణీ చేశారు. పీఎంఈజీపీ కింద బొలేరో వాహనం, డీజే సౌండ్‌సిస్టం, ఆవును, కుట్టుమిషన్‌ను అందించారు.

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ.. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 49 శాతం మేర నిరక్షరాస్యత ఉందని తెలిపారు. అయితే ఆరోజుల్లోనే నిరక్షరాస్యత ఉండరాదని యోచించిన మహోన్నత వ్యక్తి జ్యోతిబా పూలే అని తెలిపారు. 14 బీసీ సంక్షేమ వసతి గృహాల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయన్నారు.



కలెక్టరేట్‌లో జ్యోతిబా పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తదితరులు

బీసీ విద్యార్థులకు డీఎస్సీ కోచింగ్, ఉపకార వేతనాలు, జీవనోపాధుల నిమిత్తం రూ.247 కోట్లు మంజూరు చేయ నున్నట్టు వివరించారు. రూ.10 కోట్ల విలువైన ఆధునిక వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ.. బీసీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జేసీ శోభిక, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్వో కె.హేమలత, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, బీసీ సంక్షేమాధికారి ఇ.అప్పన్న, డీఎంహెచ్‌వో భాస్కరరావు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.



యజ్ఞోపవీత ధారణ

స్వర్ణకిరీటం

కల్యాణం.. వైభోగం

రఘువంశ రామయ్య.. సుగుణాల సీతమ్మ
వరమాలకై వేచె సమయాన..
శివధనువు విరిచాకె.. వధువు మది గెలిచాకె
మోగింది కల్యాణ శుభవేళ..
కల్యాణం.. వైభోగం.. శ్రీరామచంద్రుని కల్యాణం...

అన్నట్లుగా ఏకశిలానగరం పులకరించింది. శ్రీరామ నామస్మరణతో ఒంటిమిట్ట మార్మోగింది. ఆంధ్రా భద్రాద్రి, దక్షిణాది అయోధ్యగా పేరొందిన ఏకశిలానగిరి ఒంటిమిట్ట కోదండరామాలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిండు వెన్నెలలో సీతారాముల కల్యాణాన్ని టీటీడీ ఆధ్వర్యంలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో నిర్వహించారు. ముందుగా రామయ్యకు యజ్ఞోపవీతం, సీతమ్మకు స్వర్ణ కిరీటం కానుకగా అందించారు. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు అందించారు. స్వామివారి కల్యాణాన్ని చూసేందుకు భక్తులు విశేషంగా తరలి రావడంతో ఒంటిమిట్ట జనసంద్రంగా మారింది.



కళాకారుల నృత్యం





పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకువస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు



ఆలయ శిల్పకళను పరిశీలిస్తున్న సీఎం



ఎదుర్కోలు దృశ్యం



సీతారాముల కల్యాణం తిలకిస్తున్న చంద్రబాబు దంపతులు



వివిధ రకాల కాయగూరలు, పండ్లు, ఆకు కూరల పంటలు

గృహమే వ్యవసాయ క్షేత్రం

- మిద్దెలపై పంటలు
- రసాయనాలు లేకుండా సాగు
- విజయనగరం మహిళల కృషి
- మరికొంతమందికి అవగాహన కల్పించే ప్రయత్నం



మిద్దె పైన పెంచుతున్న మొక్కలను పరిశీలిస్తున్న లలితా శ్రీనివాస్, కల్యాణి, దివ్యబాలకృష్ణ

విజయనగరం రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రసాయనాలు లేని ఆకుకూరలు, పండ్లు, కాయగూరలు పండించడమే లక్ష్యంగా ముగ్గురు మహిళలు ముందుకు వెళుతున్నారు. మరి కొంతమంది మహిళల్లో చైతన్యం నింపుతున్నారు. గృహాలనే వ్యవసాయ క్షేత్రాలుగా మారుస్తున్నారు. వారే విజయనగరానికి చెందిన లలితా శ్రీనివాస్, కల్యాణి, దివ్య బాలకృష్ణ. ప్రస్తుతం విజయనగరం జిల్లాలో మిద్దెలపైన, బాల్కనీల్లో తమ ఇళ్లకు అవసరమైన ఆకుకూరలు, పండ్లు, కాయగూరలు పండిస్తున్నారు. తమలాంటి ఆలోచనలు ఉన్న వారందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి.. వారితో ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి... దాని ద్వారా సలహాలు, సూచనలు ఇస్తున్నారు. మిద్దెలు, బాల్కనీల్లో పంటలు పండించేలా ప్రోత్సహిస్తున్నారు. 'టెర్రస్ విజ్ఞాన్' పేరిట ఉన్న వాట్సాప్ గ్రూప్‌లో విజయనగరం, గరివిడి, బొబ్బిలి, పార్వతీపురం, సాలూరులో దాదాపు 400 మందికి పైగా మహిళలు ఉన్నారు. వీరంతా మిద్దెలు, బాల్కనీలపై పంటలు పండిస్తున్నారు. త్వరలో విజయనగరంలో వీరు గ్రీన్ అంబాసి డర్లుగా ఒక సంఘాన్ని స్థాపించి, మరింత మంది మహిళలను చైతన్యవంతులు చేయనున్నట్టు చెబుతున్నారు. ఇంట్లో వచ్చే తడిచెత్త, పొడిచెత్తను వేరు చేసి మొక్కలకు ఎరువులుగా వినియోగిస్తున్నారు. అదే విధంగా ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, పేపర్ గ్లాస్‌లు ఇలా ఇంట్లో ఉపయోగించేవి బయట పారేయకుండా మొక్కలకు వినియోగిస్తున్నారు. మిగిలిన వారు కూడా తమబాటలో నడిచేలా వీరు ప్రోత్సహిస్తున్నారు.

తక్కువ ఖర్చుతోనే...



చాలా తక్కువ ఖర్చుతో బాల్కనీలు, భవనాల పైఅంతస్తుల్లో ఆకుకూరలు, పండ్లు, కాయగూరలు పండించవచ్చు. గృహిణులు, వివిధ సంస్థల్లో ఉద్యోగాలు చేసే వారు సైతం తమ ఇళ్లలో వీటిని సాగు చేయవచ్చు. రసాయనాలు లేకుండా పండించుకునే అవకాశం ఉంది. మా ఇంటిపై దాదాపు 150 మొక్కలు ఉన్నాయి. వీటిలో ఆకుకూరలు, పండ్లు, కాయగూరలు, విజయనగరం మార్కెట్‌లో దొరకనివి సైతం పండిస్తున్నాం. ఇంటి అవసరాలకు విని యోగించుకుంటున్నాం. బంధువులు, స్నేహితులు వచ్చినప్పుడు వీటిని అందజేస్తున్నాం. వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి... ఇటువంటి ఆలోచనా విధానం ఉన్న వారందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి ప్రోత్సహిస్తున్నాం. ఇది శారీరకంగా, మానసికంగా కూడా మహిళలకు ఎంతో మేలు చేస్తుంది.

-లలితా శ్రీనివాస్, విజయనగరం

అన్ని రకాల పంటలు పండించవచ్చు..



రసాయనాలు లేని కాయగూరలు, పండ్లు, ఆకుకూరలను మేం 2020 నుంచి పండిస్తున్నాం. మా వాట్సాప్ గ్రూపు వల్ల జిల్లా వ్యాప్తంగా బాల్కనీ, ఇంటిపై అంతస్తుల్లో మొక్కలు పెంచే వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. రానున్న కాలంలో ఎక్కువ మంది మహిళలను చైతన్యవంతులను చేసే ప్రయత్నంలో ఉన్నాం. వీటి కోసం మహిళలు ఇంట్లో పని పూర్తయిన తరువాత రోజుకు రెండు గంటల సమయం కేటాయిస్తే సరిపోతుంది. రసాయనాలతో పండించే పంటల వల్ల చిన్న వయస్సులోనే బీపీ, షుగర్, క్యాన్సర్, గుండె జబ్బులు వంటివి వస్తున్నాయి. మేం ఎటువంటి రసాయనాలు లేకుండా ఇంట్లోనే కాయగూరలు, ఆకుకూరలు, పండ్లు సాగు చేస్తున్నాం. వాట్సాప్ ద్వారా మిగిలిన వారికి సూచనలు ఇస్తున్నాం.

-కల్యాణి, విజయనగరం

మొక్కలను కూడా ఇస్తున్నాం..



మా ఇళ్లలో ఇప్పటికే రసాయనాలు లేని కాయగూరలు, పండ్లు, ఆకుకూరలు పండించి... వినియోగిస్తున్నాం. ఆరోగ్య సమస్యలు కూడా ఉత్పన్నం కావడం లేదు. చిన్న వయస్సులోనే బీపీ, షుగర్, క్యాన్సర్, గుండెజబ్బులు వస్తున్నాయంటే, తినే ఆహారంలో తేడా ఉంటుందన్నది వాస్తవం. ఈ నేపథ్యంలో మేమంతా రసాయనాలు లేని పంటలను పండిస్తున్నాం. దీనిపై ఇప్పటికే అనేక మంది మహిళలకు అవగాహన కల్పించాం. రానున్న కాలంలో మరికొంతమందిని ఈ దిశగా పయనించేలా కృషి చేద్దామన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. ఈ విధానం ద్వారా సాగు చేసేవారికి మొక్కలను కూడా అందజేస్తున్నాం. వారికి అవసరమైన సలహాలు, సూచనలు వాట్సాప్ ద్వారా అందిస్తున్నాం

-దివ్య బాలకృష్ణ, విజయనగరం

డోలీల మోత లేకుండా చేస్తాం

- మంత్రి సంధ్యారాణి



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు

పార్వతీపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అన్ని గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మిస్తామని.. భవిష్యత్తులో డోలీల మోత లేకుండా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. కురుపాం నియోజకవర్గంలోని మారుమూల గిరిజన గ్రామాలకు సుమారు రూ.నాలుగు కోట్లతో నిర్మించిన బీటీ రహదారిని మంత్రి సంధ్యారాణి శుక్రవారం ప్రారంభించారు. ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా మర్చిపోయిందని ఆరోపించారు. మారుమూల గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. సీఎం చంద్రబాబు ఆలోచనలు భవిష్యత్తులో లోకకల్యాణం కోసమేనని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు కృషి చేస్తున్నారన్నారు. వైసీపీ కాలంలో అరాచకాలు, అన్యాయాలు జరిగాయని, అందుకే వారు 11 సీట్లకు పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. త్వరలోనే పూర్ణపాడు, లాబేసు వంతెన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. తోటపల్లి ప్రాజెక్టు ద్వారా పాలకొండ నియోజకవర్గంలో అదనంగా మరి కొన్ని ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పారు. ప్రభుత్వ విప్ జగదీశ్వరి మాట్లాడుతూ కురుపాం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, జీసీసీ చైర్మన్ కె.శ్రావణ్ కుమార్, ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్‌చంద్రదేవ్, ట్రైకార్ డైరెక్టర్ పి.లావణ్య, నాయకులు డొంకాడ రామకృష్ణ, దత్తి లక్ష్మణరావు, నంగిరెడ్డి మధుసూదనరావు, శేఖర్‌పాత్రుడు, కోలా రంజిత్ కుమార్, పాడి సుదర్శనరావు, జి.సుదర్శనరావు, తవిటినాయుడు, దేవకోటి వెంకటనాయుడు, కె.అప్పలనాయుడు, జి.వెంకటనాయుడు, ఎ.మధుసూనదరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిష్ఠోత్సవాలకు హాజరైన భక్తులు

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

కొత్తవలస, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేశపాత్రునిపాలెంలో గల సీతారాముల ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, మండపాల ఆవాహన, యాగశాల ప్రవేశాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేపట్టారు. శనివారం విశేష పూజలు, హోమాలు నిర్వహించనున్నామని వేదపండితుడు అంపోలు ఉమామహేశ్వర శర్మ తెలిపారు. ఆదివారం సీతా రామలక్ష్మణులు, అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ శిఖరప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహిస్తామని వివరించారు.

గుణాత్మక విద్యకు డైట్‌లే మూలకేంద్రాలు

- డీఈవో మాణిక్యం నాయుడు

నెల్లిమర్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గుణాత్మక విద్య బోధనకు డైట్ సంస్థలు మూల కేంద్రాలని జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యం నాయుడు అన్నారు. ఇక్కడి వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్‌లో శుక్రవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఈవో మాట్లాడుతూ డైట్‌లు ఇకపై నైపుణ్య కేంద్రాలుగా మారనున్నాయని చెప్పారు. ఛాత్రోపాధ్యాయులు శిక్షణాంశాల ను ఆకళింపు చేసుకుని మంచి భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ పగడాలమ్మ, రిటైర్డు డీఈవో డాక్టర్ ఎన్.టి.నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారావు, అధ్యాపకులు డి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



మాట్లాడుతున్న డీఈవో మాణిక్యం నాయుడు

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

పార్వతీపురం/ పార్వతీపురం టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి జయంతి ఉత్సవాన్ని జిల్లాలోని వివిధ ఆలయాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బైపాస్ రహదారిలోని అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. దుర్గాదేవి వీధిలో సర్వమంగళాదేవి పీఠం వ్యవస్థాపకుడు మురపాక కాళిదాసు శర్మ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి తిరువీధి నిర్వహించారు.



పార్వతీపురం: అయ్యప్పస్వామి తిరువీధి

బొబ్బిలిలో..

బొబ్బిలి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి జయంతి ఉత్సవాన్ని స్థానిక ఆలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



బొబ్బిలి: అయ్యప్ప మూలవిరాట్

రూ.21.13 కోట్లతో ఎస్సీ యువతకు ఉపాధి

- కలెక్టర్ అంబేడ్కర్



కలెక్టర్ అంబేడ్కర్‌తో మాట్లాడుతున్న వీసీ జీఎస్ఎన్ రాజు తదితరులు

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో షెడ్యూల్డు కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రూపొందించిన వార్షిక ప్రణాళికకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు కలెక్టర్ అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.21.13 కోట్లతో 209 యూనిట్ల ఏర్పాటుకు షెడ్యూల్డు కులాల సేవా సహకార సంస్థ ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. ఈ యూనిట్లు ఏర్పాటు చేసేటి లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రూ.1174.76 లక్షలను రుణాల రూపంలో అందించనున్నామని తెలిపారు. సబ్సిడీ రూపంలో రూ.832.64 లక్షలు అందజేస్తామని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 14 నుంచి మే 10వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

డ్రోన్ల వినియోగంలో సహకరించాలి..

వ్యవసాయం, ఉద్యాన వనాల అభివృద్ధికి సంబంధించి డ్రోన్ల వినియోగానికి సహకరించాలని సెంచూరియన్ యూనివర్సిటీని కలెక్టర్ అంబేడ్కర్ కోరారు. శుక్రవారం సెంచూరియన్ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు కలెక్టర్‌ను కలిశారు. తమ విశ్వవిద్యాలయంలో చేపడుతున్న కోర్సులు, స్కిల్ డెవలప్‌మెంట్ వివరాలను ఆయనకు వివరించారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ప్రశాంతకుమార్ మహంతి, రిజిస్ట్రార్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

వేగం మిగిల్చిన విషాదం..!

- లాంగ్ ట్రిప్ వెళ్తుండగా అదుపుతప్పిన బైక్
- భార్య అక్కడికక్కడే మృతి.. భర్తకు తీవ్రగాయాలు
- భార్యాభర్తలిద్దరూ ఇషా ఫౌండేషన్ వలంటీర్లు
- హైవేపై ఫ్లైఓవర్ రెయిలింగ్‌ని బలంగా ఢీకొని బోల్తా
- కోయంబత్తూర్ నుంచి సిక్కిం వెళ్తుండగా ప్రమాదం
- విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలంలో ఘటన
- మృతురాలిది తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు

రాజమహేంద్రవరం, పూసపాటిరేగ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆమెది ఆంధ్రప్రదేశ్.. ఆయనది తమిళనాడు.. వారిద్దరూ ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. ఇద్దరూ కోయంబత్తూరులో స్థిరపడ్డారు. బైక్‌పై దేశమంతా తిరగడం వారి హాబీ.! ఉద్యోగాలు చేసుకుంటూనే వీలు దొరికినప్పుడల్లా బైక్‌పై లాంగ్ డ్రైవ్‌లకు వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో బైక్‌పై కోయంబత్తూరు నుంచి సిక్కిం వెళ్లేందుకు బయల్దేరారు. కానీ.. ఓవర్ స్పీడ్ వారి జీవితాల్లో తీరని విషాదం నింపింది. విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం చోడమ్మ అగ్రహారం జాతీయరహదారిపై శుక్రవారం ఉదయం వారు ప్రయాణిస్తున్న బైక్ అతివేగం కారణంగా అదుపుతప్పి ఫ్లైఓవర్ రెయిలింగ్‌ని బలంగా ఢీకొని బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో భార్య అక్కడికక్కడే మృతిచెందగా.. భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. మృతురాలు నంబూరి నాగసత్యవతి (33) స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా దివాన్ చెరువు. దంపతులిద్దరూ ఇషా వలంటీర్లు.

జర్మనీలో కలిసిన మనసులు..

రాజమహేంద్రవరం రూరల్ దివాన్‌చెరువుకు చెందిన హరినాథబాబుకు ఒక కుమార్తె, కొడుకు ఉన్నారు. కుమార్తె నంబూరి నాగసత్యవతి జర్మనీలో ఎంఎస్ పూర్తి చేశారు. తమిళనాడుకు చెందిన భార్గవ్ రాజన్‌తో కూడా ఆమెతోపాటు అక్కడే చదువుకున్నారు. అక్కడ వారిద్దరి మనసులు కలవడంతో పెద్దల అంగీకారంతో 2017లో హైదరాబాద్‌లో పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత ఇద్దరూ ఉద్యోగాల నిమిత్తం జర్మనీ వెళ్లిపోయారు. కొన్నాళ్లకు కోయంబత్తూరులోని ఇషా ఫౌండేషన్ గురించి తెలుసుకుని.. దైవ మార్గంలో నడవాలని ఇద్దరూ నిర్ణయించుకున్నారు. దీంతో కోయంబత్తూరులో స్థిరనివాసం ఏర్పాటు చేసుకుని 2018 నుంచీ ఇషాలోనే ఉంటున్నారు. భార్యభర్తలిద్దరికీ దూర ప్రాంతాలకు ప్రయాణించడమంటే ఇష్టం కావడంతో ఏడాదికి ఓసారి లాంగ్ డ్రైవ్‌లకు వెళ్తుంటారు. రెండేళ్ల క్రితం డెహ్రాడూన్ ట్రెక్కింగ్‌కి వెళ్లారు. ఈ ఏడాది సిక్కిం చుట్టి రావాలని అనుకున్నారు. కోయంబత్తూరు నుంచి రెండు రోజుల క్రితం దివాన్‌చెరువు వచ్చారు. శుక్రవారం తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై సిక్కిం బయలుదేరారు. ఉదయం 10.30 గంటల సమయంలో వీరు ప్రయాణిస్తున్న బైక్ విజయనగరం జిల్లా చోడమ్మ అగ్రహారం సమీపంలో ఫ్లైఓవర్ రెయిలింగ్‌ను వేగంగా ఢీకొట్టింది. ఆ వేగానికి బైక్ రహదారి డివైడర్‌కు తగిలి అవతలివైపు పడింది. ఈ ప్రమాదంలో నాగసత్యవతి అక్కడికక్కడే ప్రాణాలు వదిలగా.. భార్గవ్‌కి తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. ఆయన ఎడమ చేయి తొలగించినట్లు తెలిసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.



ప్రమాదానికి గురైన బైక్

13 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

రాజాం రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లోశుక్రవారం రాత్రి రాజాం టౌన్ సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ రవికిరణ్ నిర్వహించిన దాడుల్లో 13 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు.వారి నుంచి రూ.68,570 స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని పొగిరి సమీపంలో పేకాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.6140 నగదు స్వాధీనం చేసుకుని ఎస్ఐ రవికిరణ్ కేసు నమోదు చేశారు. అలాగే శ్రీకాకుళం రోడ్డులో పేకాట శిబిరంపై దాడి చేసి పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.62,430 నగదును స్వాధీనం చేసుకుని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ కేసు నమోదు చేశారు.

గంజాయి విక్రయదారులు..

విజయనగరం క్రైమ్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని రైల్వే రిజర్వేషన్ కౌంటర్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని,అతడి నుంచి 6 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వన్ టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా లాటింగి గ్రామానికి చెందిన ముకుంద్ బహార్‌దలాయ్ గంజాయి ప్యాకెట్‌లను విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నట్టు అందిన సమాచారం మేరకు ఎస్ఐ రామ్‌గణేశ్,సిబ్బంది దాడి చేసి సదరు వ్యక్తిని పట్టుకున్నారన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు.

సారా కాస్తున్న ముగ్గురు..

సీతంపేట రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సుందరయ్యగూడ సమీపంలో సారా కాస్తున్న ముగ్గురిని గుర్తించి అదుపులోకి తీసుకున్నామని జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఏఎస్ దొర తెలిపారు. పాలకొండ, కొత్తూరు ఎక్సైజ్‌స్టేషన్ సిబ్బందితో కలిసి శుక్రవారం దాడులు నిర్వహించామని చెప్పారు. ఈ దాడుల్లో సుందరయ్యగూడ పరిసరాల్లో సారా తయారు చేస్తున్న వూయక మురళి, బి.ఆదినారాయణ, వూయక సంజీవరావులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 870 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. 1250 లీటర్ల బెల్లం ఊటను కూడా ధ్వంసం చేశామన్నారు. వీటి తయారీకి బెల్లం విక్రయించిన కొత్తూరు మండలం లబ్బ గ్రామానికి చెందిన జామి సురేష్‌పై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో పాలకొండ, కొత్తూరు మొబైల్ పార్టీ సీఐలు మురళి, కిరణ్మయి, పాలకొండ ఎక్సైజ్ ఎస్ఐలు జి.ఫణీంద్రబాబు, ఎల్.తిరుపతిరావు, ఎ.వాసుదేవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం లోడుతో ట్రాక్టర్ బోల్తా

నెల్లిమర్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదతరిమి జంక్షన్ సమీపంలో శుక్రవారం నెల్లిమర్ల- రణస్థలం రోడ్డులో ధాన్యం బస్తాలతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి నష్టం జరగలేదు. ఆ సమయంలో డ్రైవర్ తప్ప ట్రాక్టర్‌లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్టయింది. అయితే ట్రాక్టర్ బోల్తా పడి రోడ్డుకు అడ్డంగా ఉండిపోవడంతో కొద్దిసేపు ఆ మార్గంలో రాకపోకలు నిలిచాయి.

17 గ్రామాల వారికి రుణాలు ప్రశ్నార్థకమే..

- ఆందోళన చెందుతున్న దరఖాస్తుదారులు

లక్కవరపుకోట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న 17 గ్రామాల వారికి రుణసాయం అందడం ప్రశ్నార్థకంగా మారింది. దాంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. వీళ్లంతా కొత్తవలస మండలంలోని బ్యాంకులతో ఆర్థిక లావాదేవీలు కొనసాగిస్తున్న వారే. ప్రభుత్వం మండలాన్ని యూనిట్‌గా పరిగణించి ఈసారి రుణాలు మంజూరు చేసింది. దాంతో నర్సింపేట, గొర్లెవానిపాలెం, పోతంపేట, కుద్దువలస, రెడ్డిపాలెం, నీలకంఠాపురం, పెదిరెడ్లపాలెం, రేగ, భూమిరెడ్డిపాలెం, లచ్చింపేట, కల్లేపల్లి, పూడివానిపాలెం, ఎన్జీవీ పాలెం, తామరాపల్లి, శ్రీరాంపురం, గంగుబూడి, కోనమసివానిపాలెం గ్రామాల నుంచి 130 మంది దరఖాస్తుదారులు రుణం పొందలేని పరిస్థితి ఏర్పడింది. వీళ్లకు కొత్తవలసలోని స్టేట్ బ్యాంకు, యూనియన్ బ్యాంకు, ఏపీజీవీబీ, కార్పొరేషన్, బ్యాంక్ ఆఫ్ బరోడాలలో ఖాతాలు ఉన్నాయి. వీరెవరికీ సొంత మండలం ఎల్.కోటలోని బ్యాంకులతో సంబంధాలు లేవు. అయితే రుణాల మంజూరులో మండలాన్ని యూనిట్‌గా ప్రకటించడంతో ఎల్.కోటకు చెందిన వావరెవరికీ కొత్తవలస బ్యాంకుల్లో రుణాలు ఇవ్వలేమని బ్యాంకర్లు చెబుతున్నారు. మేమేమీ చేయలేమని మండల అధికారులు చేతులు ఎత్తేశారు. ఖాతాలు మార్చుకోవాలని వారు ఉచితం సలహా ఇచ్చి తప్పించుకుంటున్నారు. అయితే ఇప్పటికే సంబంధిత బ్యాంకులతో బిజినెస్, ఎడ్యుకేషన్ రుణాలు తీసుకున్నవారు ఆ ఖాతాలను ఇప్పటికిప్పుడు మార్చుకునే అవకాశంలేదు. ఈనేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రుణ దరఖాస్తుదారులకు న్యాయం చేయాల్సి ఉంది.

నిబంధనల మార్పుతో అధికారులకు తలనొప్పి

గరుగుబిల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరులో నిబంధనలు మారడంతో అధికారులకు తలనొప్పిగా మారింది. గతంలో బీసీ రుణాలకు సంబంధిత గ్రామాలను దత్తత తీసుకునే బ్యాంకులకు ఎంపీడీవోలు సిఫారసు చేసేవారు. ప్రస్తుతం అన్ని బ్యాంకుల రుణాలకు ఎంపీడీవోలు సిఫార్సు చేశారు. అయితే ఆయా మండలాల పరిధిలోని బ్యాంకులు ఆమోదం తెలిపేందుకు కొంతమేర వెనుకంజ వేస్తున్నాయి. దీంతో ఎంపీడీవోలు తలలు పట్టుకుంటున్నారు. గరుగుబిల్లికి సంబంధించి 118 యూనిట్లుకు 451 దరఖాస్తులు రాగా 119 మందిని ఎంపిక చేశారు. ప్రస్తుతం ఎస్‌బీఐ గరుగుబిల్లి, గ్రామీణ వికాస్ బ్యాంకు, యూనియన్ బ్యాంకు రావివలస, కెనరా బ్యాంకు నవిరి పరిధిలో 35 మందికే మంజూరు చేశారు.

కౌలు వేలం పాట వాయిదా

సంతకవిటి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సిరిపురంలోని కొండపై వెలిసిన కొండ కామేశ్వర ఆలయానికి చెందిన భూమి కౌలు వేలం పాట వాయిదా పడింది. ఆలయానికి చెందిన సర్వే నెంబర్ 84లో 2.70 ఎకరాలను కౌలుకు ఇచ్చి ఆ ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి ఉపయోగించేందుకు శుక్రవారం వేలం నిర్వహించేందుకు దేవదాయ అధికారులు గ్రామానికి వచ్చారు. అయితే సంబంధిత భూమిలో ఆలయ అర్చకులు ఆయిల్‌పామ్ మొక్కలు ఇదివరకే నాటడంతో వాటిని తొలగించిన తర్వాతే వేలం నిర్వహించాలని గ్రామస్థులు అధికారులను కోరారు. అందుకు దేవదాయ అధికారులు అంగీకరించారు. తదుపరి వేలం వేసే సమయాన్ని వెల్లడిస్తామని ఈవో బి.వి.మాధవరావు, రాజాం నవదుర్గ ఆలయం ఈవో పి.శ్యామలరావు తెలిపారు.

నేడు పనిచేయనున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ఈనెల 12న రెండో శనివారం జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ కార్యాలయాలు పనిచేస్తాయని జిల్లా రిజిస్ట్రార్ పి. రామలక్ష్మి పట్నాయక్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. భూముల రిజిస్ట్రేషన్‌తో పాటు అన్ని సేవలు పొందవచ్చునని‌పేర్కొన్నారు.

14న పీజీఆర్ఎస్ రద్దు

విజయనగరం కలెక్టరేట్ ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ఈనెల 14నప్రజా సమస్యలు పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ అంబేడ్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా కార్యాలయానికి సెలవు కావడంతో పీజీఆర్ఎస్‌ను రద్దు చేస్తున్నట్టు వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డెంకాడ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌లైన్ అభివృద్ధి పనుల జరుగుతున్న నేపథ్యంలో శనివారం మండలంలోని మోపాడ, జగన్నాథపురం గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందన్నారు.

సమస్యల పరిష్కారానికే వెల్ఫేర్‌డే

విజయనగరం క్రైం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి పోలీసు వెల్ఫేర్ డే నిర్వహిస్తున్నామని ఎస్పీ వకుల్‌జిందాల్ అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖపరమైన సమస్యలను తెలుసుకుని వాటి పూర్వపరాలు పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

ఆత్మరక్షణపై అవగాహన

గజపతినగరం, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు ఆత్మరక్షణపై అందజేస్తున్న శిక్షణపై విద్యార్థినులు అవగాహన పెంపొందించుకోవాలని ఎస్ఐ కె.లక్ష్మణరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో వారం రోజులుగా నిర్వహిస్తున్న కరాటే శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. విద్యార్థినులకు ఇటువంటి శిక్షణ ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ ఎన్ఎంయూ ధర్నా

శృంగవరపుకోట ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట ఆర్టీసీ డిపో గేటు వద్ద శుక్రవారం రెండోరోజూఎన్ఎంయూ గేటు ధర్నా నిర్వహించింది. పలు సమస్యల పరిష్కారానికి నినాదాలు చేశారు. డిపో కార్యదర్శి ఎ.రాజయ్య, డిపో అధ్యక్షుడు జి.వి.రమణ ఉన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించండి

రాజాం/రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని రాజాం గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రాజాం తహసీల్దారు కృష్ణంరాజుకు అందజేశారు. వీఆర్‌ఏలకు రూ.26 వేలు కనీస వేతన ఇవ్వాలన్నారు. డీఏను జీతంతో కలిపి ఇవ్వాలని, నామినీలను వీఆర్‌ఏలుగా గుర్తించాలన్నారు. నైట్ డ్యూటీలను రద్దు చేయాలన్నారు. అర్హులైన వీఆర్‌ఏలకు పదోన్నతి కల్పించాలన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. తహసీల్దారును కలిసిన వారిలో శ్రీను, దుర్గారావు, కుమార్ తదితరులున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

గరివిడి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలో కోడూరులో అయ్యప్పస్వామి ఆలయం వార్షికోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో గురుస్వాములు ఎడ్ల పైడినాయుడు, బి.నాగరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అయ్యప్పస్వామి నామ సంకీర్తన చేశారు. పూజల్లో గరివిడి ఎస్ఐ లోకేశ్వరరావు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

సహకారం మరువలేనిది

విజయనగరం క్రైం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయాధికారిగా పోలీసుశాఖకు అందించిన సహకారం మరువలేనిదని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. జిల్లా జడ్జిగా విధులు నిర్వహిస్తూ ఇటీవల గుంటూరు జిల్లాకు బదిలీ అయిన బి.సాయికల్యాణ్ చక్రవర్తిని శుక్రవారం ఎస్పీ వకుల్ జిందాల్‌జిల్లా కోర్టులో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎస్పీమాట్లాడుతూ పోలీసు, న్యాయశాఖలు సమన్వయంతో పనిచేసి పలు కేసుల్లో దోషులకు శిక్షపడేలా చర్యలు చేపట్టారన్నారు. 2013లో డైరెక్టు రిక్రూట్‌మెంట్ ద్వారా జిల్లాన్యాయాధికారిగా ఎంపికైన కల్యాణచక్రవర్తి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాంపల్లి, మెదక్ జిల్లాలోనూ, రాష్ట్రాల పునర్విభజన తరువాత రాజమహేంద్రవరం, కడప జిల్లాల్లో సమర్థంగా పనిచేసి న్యాయశాఖ ప్రతిష్ఠను ఇనుమడింప చేశారన్నారు.



సాయికల్యాణ చక్రవర్తికి జ్ఞాపికను అందజేస్తున్న ఎస్పీ

కేసుల పరిష్కారానికి కృషి చేయండి

రాజాం రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 10న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో సాధ్యమైనన్ని కేసుల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షురాలు, సీనియర్ న్యాయాధికారి కె.శారదాంబ పిలుపునిచ్చారు. ఇక్కడి కోర్టు సముదాయ ప్రాంగణంలో రాజాం బార్ అసోసియేషన్, పోలీస్, రెవెన్యూ, బ్యాంకర్లు, చిట్‌ఫండ్ కంపెనీల ప్రతినిధులు, పలు బ్యాంకుల న్యాయవాదులతో శుక్రవారం వేర్వేరుగా న్యాయాధికారి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజీకి అనుకూలమైన సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసులను ఇరుపార్టీల అంగీకారంతో పరిష్కరించాలన్నారు. లోక్‌అదాలత్‌లో ఇచ్చిన తీర్పును అంతిమ తీర్పుగా జడ్జి శారదాంబ స్పష్టం చేశారు. సమావేశంలో జూనియర్ న్యాయాధికారి నైమిష, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జయదేవ్, న్యాయ వాదులు, పోలీస్, రెవెన్యూ, బ్యాంకింగ్, మున్సిపల్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ న్యాయాధికారి

పూలే జీవితం అందరికీ ఆదర్శం

భోగాపురం, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిబాపూలే జీవితం అందరికీ ఆదర్శమని మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా శుక్రవారం మండలంలోని పోలిపల్లిలో ఆయన నివాసంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమసమాజ నిర్మాణంలో పూలే కీలకపాత్ర పోషించారన్నారు. స్త్రీ, పురుష సమానత్వం కోసం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, ప్రొఫెషనల్ వింగ్ విజయనగరం పార్లమెంట్ అధ్యక్షుడు కాళ్ల రాజశేఖర్, దాసరి అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న బంగార్రాజు

- చీపురుపల్లి:మహాత్మా జ్యోతీరావు పూలే జయంతి వేడుకలు చీపురుపల్లి పట్టణంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు నేతృత్వంలో కార్యకర్తలు పూలే విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు యడ్ల సంతోష్, మీసాల సూరినాయుడు, కోట్ల శిరీష, రమ, అప్పలనాయుడు, విక్రమ్ పాల్గొన్నారు.



పూలే చిత్రపటం ఎదుట..

- రాజాం రూరల్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి విశేషమైన కృషి చేసిన ఘనత జ్యోతిరావ్ పూలేకి దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి కుప్పిలి చైతన్యకుమార్ స్పష్టం చేశారు. జ్యోతిరావ్ పూలే జయంతి సందర్భంగా రాజాంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నివాళి అర్పిస్తున్న చైతన్యకుమార్

- రాజాం: జ్యోతిబాపూలే జయంతిని శుక్రవారం వంజరాంపేటలో నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటగిరి నారాయణరావు.. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



చిత్రపటం ఎదుట నివాళి అర్పిస్తున్న కోటగిరి

అన్నిరంగాల్లో అభివృద్ధే ధ్యేయం

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో సీఎం చంద్రబాబు అభివృద్ధి చేసున్నారని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని పోతనాపల్లిలో స్థానిక నేత కూనిరెడ్డి రాముడు ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, మండల పార్టీ నాయకులు జీఎస్ నాయుడు, రెడ్డి వెంకన్న, ఆడారి మహేశ్వరరావు, జనసేన నాయకుడు సన్యాసినాయుడు తదితరులున్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

రూ.130 కోట్లు తీసుకువచ్చా: ఎమ్మెల్యే

లక్కవరపుకోట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికి ఉపాధిహామీ నిధుల ద్వారా సుమారు రూ.130 కోట్లను పది నెలల్లో తీసుకురాగలిగానని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శుక్రవారం ఆమె జమ్మాదేవిపేట, రంగాపురం గ్రామాల్లో రూ.20 లక్షల విలువ గల సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువుల షెడ్లు, సీసీ రోడ్లు, డ్రైన్స్ కల్వర్టులు, వంతెనలు ఇలా అన్ని రకాల మెటీరియల్ పనులకు నియోజకవర్గానికి ప్రభుత్వం రూ.130 కోట్ల ఉపాధి నిధులను విడుదల చేసిందన్నారు. అభివృద్ధి పనుల్లో జిల్లాలో రెండో స్థానంలో ఉన్నామన్నారు. అనంతరం నందీశ్వరుడికి పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావు, కొట్యాడ ఈశ్వరరావు, భూపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లపై రాద్ధాంతం తగదు: కళా



చీపురుపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):పింఛన్ల మంజూరుపై వైసీపీ నాయకులు లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారని, ఇటువంటి ఆరోపణలు వారికి తగవని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. శుక్రవారం ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. వెయ్యి రూపాయల పింఛను పెంపుదలకు గతంలో ఆ పార్టీ పాలకులు ఐదేళ్ల సమయం తీసుకున్న విషయాన్ని మరిచిపోకూడదన్నారు. ఎన్నిలకు ముందు ఇచ్చిన హామీ మేరకు 3 వేలు నుంచి నాలుగు వేలకు పెంచడమే కాకుండా మూడు నెలల ఎరియర్స్‌తో సహా ఏడు వేలు ఇచ్చిన విషయాన్ని ఆ పార్టీ నాయకులు గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. కొత్త పింఛన్ల మంజూరుకు అవసరమైన కసరత్తును ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిందన్నారు. కొద్ది రోజుల్లో కొత్త పింఛన్లు మంజూరవుతాయన్నారు. ఉనికిని కాపాడుకోవడానికి వైసీపీ నాయకులు ధర్నాలు, ఉద్యమాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు.

వ్యాఖ్యలను వెనక్కితీసుకోవాలి


విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2019 నుంచి సంఘంలో పనిచేస్తున్న పీఏసీఎస్ సిబ్బందిపై సీఈవో ఉమామహేశ్వరరావు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని పీఏసీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పి.కామేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో ఉమ్మడి జిల్లాల పీఏసీఎస్ అసోసియేషన్ ప్రతినిధులు సత్యారావు, రామునాయుడు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ సీఈవో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారన్నారు. లక్కిడాం పీఏసీఎస్‌లోని కంప్యూటర్ ఆపరేటర్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. గతంలో ఇచ్చిన కరువు భత్యం ఇచ్చిన సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. అర్హత కలిగిన ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు నారాయణరావు, సత్యనారాయణ, గిరిబాబు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న పీఏసీఎస్ ఉద్యోగులు

నర్సింగరావుకు అభినందనలు

విజయనగరం రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): విజయనగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన కర్రోతు నర్సింగరావును టీడీపీ సీనియర్ నాయకుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా నర్సింగరావు దంపతులను సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.



సత్కరిస్తున్న ఐవీపీ రాజు

బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించండి

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కుల గణన ప్రకారం బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలని బహుజన సమాజపార్టీ రాష్ట్ర కార్యదర్శి సోము రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా సమరభేరి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ కులగణన ప్రకారం బిసిలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయాల్లో రిజర్వేషన్‌లు కల్పిం చాలని డిమండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సోములు, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి లాన్ టెన్నిస్ పోటీలు

- పదేళ్ల తర్వాత సిటీ క్లబ్‌లో...

విజయనగరం రూరల్ , ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో సిటీక్లబ్ తెలియని వారుండరు. పెద్ద వయస్సు నుంచి నేటితరం వరకూ నగరపాలక సంస్థ కార్యాలయం రోడ్డులోని ఈ సిటీ క్లబ్‌లో పదేళ్ల కిందట వరకు ఏటా టెన్నిస్ పోటీలు నిర్వహించేవారు. తాజాగా అక్కడ టెన్నిస్ సాధన చేస్తున్న వారు ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎంతో మంది జాతీయ, రాష్ట్రస్థాయిలో ఆడే టెన్నిస్ క్రీడాకారులు ఇక్కడ పోటీల్లో పాల్గొనేవారు. అటువంటి సిటీక్లబ్‌లో తిరిగి ఈ నెల 12, 13 తేదీల్లో పోటీలు జరుగుతుండటంతో నగరంలో దీనిపై చర్చ జరుగుతోంది. సీనియర్ క్రీడాకారుడు రామారావు ఆదేశాల మేరకు ప్రస్తుతం సిటీక్లబ్‌లో సాధన చేస్తున్న సిటీక్లబ్ క్రీడాకారులు వైభవ్, కౌశిక్, సాత్విక్ తదితరులు పోటీల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

సిటీక్లబ్‌లోని రెండు క్లే కోర్టుల్లో శనివారం ఉదయం 6.30 గంటలకు ఈ పోటీలను సిటీక్లబ్ ప్రతినిధులు రంగారావు దొర, సన్నిబాబు దొర, సీనియర్ టెన్నిక్ క్రీడాకారుడు సన్యాసిరాజు, శంకరరావు ప్రారంభించనున్నారు. జూనియర్, సీనియర్స్ రెండు విభాగాల్లో ఈ పోటీలు జరగనున్నాయి. జూనియర్స్‌కు అండర్-12, అండర్-16 విభాగాల్లో, సీనియర్లకు 30 ప్లస్, 40 ప్లస్, 50 ప్లస్ విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. 12, 13 తేదీల్లో జరగనున్న ఈ పోటీలు ఉదయం 6.30 గంటల నుంచి 11.30 గంటల వరకూ, మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ఈ పోటీలు జరగనున్నాయి.



పోటీలకు సిద్ధమైన సిటీ క్లబ్‌లోని క్లే కోర్టులు

పనులు పూర్తయితే సస్యశ్యామలమే..

(5వ పేజీ తరువాయి)

ఇందులో మన్యం జిల్లాలో 13,683 ఎకరాలకు మాత్రమే నీరు అందుతుంది. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు మిగిలిన భూములకు సాగునీరు సరఫరా అవుతుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి 11 స్ట్రక్చర్స్, 239 డిస్ట్రిబ్యూటర్స్, ఎర్త్ వర్క్ , కాంక్రీట్ తదితర పనులు చేపట్టాల్సి ఉంది.

పెదంకలాం ఆనకట్ట

ఈ ఆనకట్ట సీతానగరం మండలం పెదంకలాం గ్రామం వద్ద ఉంది. బలిజిపేట మండలంలో 6,617.16 ఎకరాలకు, విజయనగరం జిల్లా వంగర మండలంలో 1,636.31 ఎకరాలకు సాగునీరందించే సామర్థ్యంతో దీనిని నిర్మించారు. ఆనకట్ట ఆధునికీకరణకు 2019, ఫిబ్రవరి 15న రూ. 17.30 కోట్లతో పరిపాలన ఆమోదం, 2020, జూన్ 22న సాంకేతిక అనుమతులు లభించాయి. ఈ పనులు చేపట్టేందుకు తెలంగాణ రాష్ట్రం సూర్యపేటలో ఎం/ఎస్ ఎస్‌కేఆర్ కనస్ట్రక్షన్, ఎం/ఎస్ రాజ్‌వర్మ ఇన్ కార్పొరేషన్ సంయుక్తంగా ముందుకొచ్చాయి. 2023 , డిసెంబరు 31 నాటికి పనులు పూర్తి చేయాలని వారితో నీటి పారుదలశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ గడువు నాటికి కేవలం ఐదు శాతం పనులే జరిగాయి. రూ.65 లక్షల పనులైనా గత ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు.

వెంగళరాయసాగర్

ఈ ప్రాజెక్టు సాలూరు మండలం లక్ష్మీపురం వద్ద సువర్ణముఖి నదిపై ఉంది. కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా మూడు మండ లాల్లో 24,700 ఎకరాలకు సాగునీరందించే సామర్థ్యంతో దీనిని నిర్మించారు. వీఆర్ఎస్ ద్వారా మక్కువ మండలంలో 14,550 ఎకరాలు, బొబ్బిలిలో 6,407 ఎకరాలు, సీతానగరంలో 3,723 ఎకరాలకు సాగునీరందాల్సి ఉంది. కానీ కాలువల లైనింగ్ పాడవడంతో శివారు భూములకు సాగునీరండం లేదు. దీంతో రూ. 63.50 కోట్లతో ఈ ప్రాజెక్టు ఆధునికీకరణ పనులకు 2019, ఫిబ్రవరి 15న పరిపాలన ఆమోదం, 2020 జూలై 11న సాంకేతిక అనుమతులు లభించాయి. ఈ పనులకు గాను తెలంగాణ రాష్ట్రం సూర్యపేటలో ఉన్న ఎం/ఎస్ ఎస్‌కేఆర్ కనస్ట్రక్షన్స్, ఎం/ఎస్ రాజ్‌పద్మ ఇన్ కార్పొరేషన్లతో 2020, ఏప్రిల్ 26న రూ. 48.90 కోట్లతో నీటి పారుదలశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఇప్పందం కుదుర్చుకున్నారు. తొలుత పనుల పూర్తికి 2023, ఏప్రిల్ 25 నాటికి గడువు విధించారు. కేవలం 21 శాతం పనులు మాత్రమే జరిగాయి. ఈ ఏడాది మార్చి 31 వరకు పొడిగించిన గడువు కూడా పూర్తయిపోయింది.

● వీఆర్ఎస్ ప్రాజెక్టు వద్ద స్ట్రక్చర్ల పునర్నిర్మాణం, లైనింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. అదే విధంగా కొత్త స్ట్రక్చర్లు నిర్మించాల్సి ఉంది. శంబర వద్ద ఉన్న గోముఖి అక్విడెక్ట్ 2010లో కూలిపోయింది. దీని నిర్మాణానికి సంబంధించి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కొంతవరకు పనులు చేపట్టారు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఎస్.పెద్దవలస, మార్కొండపుట్టి తదితర గ్రామాల్లో రెండు వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదు. రూ.10 కోట్ల వరకు ఆధునికీకరణ పనులు పూర్తి చేసినా.. గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా బిల్లు చెల్లించలేదు. దీనితో పనులు నిలిచిపోయాయి.

సాగునీటికి ఇబ్బందులు

గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా జంఝావతి హైలెవెల్ పనులు పూర్తి కాలేదు. సాగునీటికి కటకటలాడాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలి.

- అప్పలనాయుడు, రైతు, చిన్నబొండపల్లి, పార్వతీపురం మండలం

పూర్తి చేయాలి

పెదంకలాం ఆయకట్టు ఆధునికీకరణ పనులు పూర్తికాకపోవడంతో వ్యవసాయ భూములకు సాగునీరందం లేదు. ఏటా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. తక్షణమే పనులు పూర్తి చేసి సాగునీరు అందించాలి.

- సత్యంనాయుడు, రైతు, బలిజిపేట

ఆదేశాలు రాలేదు

జైకా నిధులతో చేయాల్సిన ఆధునికీకరణ పనులకు గడువు ముగియడం వాస్తవమే. అయితే తదుపరి ఆదేశాలు ప్రభుత్వం నుంచి ఏమీ రాలేదు. మరో ఏడాదికి గడువు పొడిగించే అవకాశం ఉందని భావిస్తున్నాం.

- ఆర్.అప్పారావు, సూపరింటెండెంట్ ఇంజనీర్, నీటి పారుదలశాఖ, పార్వతీపురం మన్యం

పనిభారం తగ్గించాలి

● కొనసాగిన ఎన్ఎంయూ నాయకుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న ఎన్ఎంయూ నాయకులు

పాలకొండ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు వీఎల్ రావు డిమాండ్ చేశారు. పాలకొండ డిపో వద్ద శుక్రవారం ధర్నా కొనసాగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు పనిభారం తగ్గించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కాలం చెల్లిన బస్సులను నిలుపుదల చేయాలన్నారు. ఈ నిరసనలో డిపో కార్యదర్శి వావిలపల్లి రాజేష్, డిపో అధ్యక్షుడు ఎస్‌టీ రావు, డిపో చైర్మన్ ఎంఎస్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ సంగమేష్, ఎంవీ నాయుడు, ధర్మాంబ, పుణ్యవతి, గ్యారేజ్ కార్మికులు పాల్గొన్నారు.

జిల్లా యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న రెల్లి కులస్థులు

వీరఘట్టం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం వీరఘట్టంలో రెల్లిజాతి నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో రెల్లిజాతి వారికి మిగతా జాతులతోపాటుగా సమన్యాయం చేయాలని కోరారు. కుల జనగణన అయిన తర్వాతనే వర్గీకరణ చేయాలని, జిల్లాను యూనిట్‌గా చేసి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ద్ధకు ర్యాలీగా వెళ్లి రెవెన్యూ అధికారి జి.కృష్ణకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్.జీవరత్నం, బి.బాబూరావు, జలుమూరు రాము, డి.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ యోజన ప్రారంభం

ఒడిశా

రాయగడ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ జన ఆరోగ్య యోజన, గోపబంధు జన ఆరోగ్య యోజన, ఆయుష్మాన్ భయబందన యోజన కార్యక్రమాలను రాయగడ జిల్లాలోని 39 ప్రాథమిక, సామాజక ఆరోగ్య కేంద్రాల్లో శుక్రవారం ప్రారంభించారు. వీటిని కేంద్ర ఆరోగ్య, కుటుంబ, రసాయన శాఖామంత్రి జేపీ నడ్డా, ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝితో కలిసి కటక్‌లోని బలియాత్ర మైదానంలో ప్రారంభించారు. ఈ మేరకు స్థానిక రింగురోడ్డులోని సీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పారుల్ పట్వారి పాల్గొని, అర్హులైన 25 మందికి కాంబో కిట్లు, ఆరోగ్య కార్డులు అందజేశారు. చైతన్య రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ పథకం కింద 1.03 కోట్ల కుటుంబాలకు చెందిన 3.06 కోట్ల మందికి లబ్ధి చేకూరనుంది. జడ్పీ అభివృద్ధి కార్య నిర్వాహణాధికారి అక్షయ్‌కుమార్ ఖెముండు, జిల్లా వైద్యాధికారి ప్రపుల్లకుమార్ పాడి, మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్, పురపాలక కార్య నిర్వాహణాధికారి సోరెన్ కుల్దీప్ కుమార్, డీపీఎం రాజేష్ పట్నాయక్ పాల్గొన్నారు.

శుద్ధజలం.. మూణ్నాళ్ల ముచ్చటేనా?

● పాఠశాలల్లో మూలకు చేరిన ఆర్వో ప్లాంట్లు

● బోర్లపై ఆధారపడుతున్న విద్యార్థులు

వీరఘట్టం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు శుద్ధం జలం అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం వేలాది రూపాయలు ఖర్చు చేసి ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసింది. కానీ ఇవి మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. విద్యార్థులు నీటి కోసం బోర్లపైనే ఆధార పడాల్సి వస్తోంది. మండలంలోని 24 ప్రాథమిక పాఠశాలలకు, పది ప్రాథమికోన్నత పాఠశాలలకు, నాలుగు ఉన్నత పాఠశాలలకు గతంలో నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా ఆర్వో ప్లాంట్లను సమకూర్చారు. కానీ కొద్ది రోజుల్లోనే అవి మరమ్మతులకు గురయ్యాయి. కిమ్మి, నడుకూరు ప్రాథమికోన్నత పాఠశాలలు, వీరఘట్టం బాలికల జడ్పీ ఉన్నత పాఠశాల తదితర పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు మూలకు చేరాయి. బాగు చేయాలని ఎన్నిసార్లు ఉన్నతాధికారులకు తెలియజేసినా ఫలితం లేకుండాపోతుంది. దీంతో విద్యార్థులు దాహార్తి తీర్చుకునేందుకు అవస్థలు పడుతున్నారు. కొంతమంది ఇంటి వద్ద నుంచి నీరు తీసుకొస్తున్నారు.

జలగంట సరే.. నీరేదీ?

ఇటీవల పాఠశాలల్లో వేసవి దృష్ట్యా విద్యార్థులకు జలగంట కార్యక్రమం అమలు చేస్తున్నారు. ఉదయం 10గంటలకు, 11గంటలకు, 12 గంటలకు ఒకసారి జల గంట మోగించాలని ఆదేశాలు జారీ చేశారు. కానీ పాఠశాలలో శుద్ధజలం అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు ఇంటి నుంచి తీసుకొచ్చిన నీటినే తాగుతున్నారు. అవి అయిపోతే పాఠశాల వద్ద ఉన్న బోరు నీటిని తాగుతున్నారు. ప్రభుత్వం దీనిపై దృష్టిసారించి ఆర్వో ప్లాంట్లను వినియోగంలోకి తీసుకురావాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.



వీరఘట్టం జడ్పీ ఉన్నత పాఠశాలలో పాడైన ఆర్వో ప్లాంట్



కిమ్మి ప్రాథమికోన్నత పాఠశాలలో..

ఉన్నతాధికారులకు తెలియజేస్తాం

ఈ విషయమై ఎంఈవో ఎం.ఆనందరావు వద్ద ప్రస్తావించగా.. నాడు-నేడు కార్యక్రమంలో మంజూరైన ఆర్వో ప్లాంట్లు కొన్ని పాఠశాలల్లో పాడయ్యాయని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి, మరమ్మతులు చేయిస్తామని ఆయన చెప్పారు.

మంత్రి దృష్టికి లిఫ్ట్ ఇరిగేషన్ సమస్య



మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

జియ్యమ్మవలస, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): లిఫ్ట్ ఇరిగేషన్ సమస్య మరోసారి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి దృష్టికి వెళ్లింది. శుక్రవారం గుమ్మలక్ష్మీపురం మండల పర్యటనకు వెళ్లిన ఆమెకు గరుగుబిల్లి మండలం గిజబ జంక్షన్ వద్ద టీడీపీ ప్రతినిధులు డొంకాడ రామకృష్ణ, మరడాన తవిటినాయుడు ఆధ్వర్యంలో రైతులు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అలాగే జియ్యమ్మవలస మండలంలో చింతల బెలగాం వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని పలువురు వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

మంత్రికి స్వాగతం పలికిన ప్రభుత్వ విప్

కురుపాం, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మొట్టమొదటిసారిగా ఏజెన్సీ పర్యాటనకు వచ్చిన సందర్భంగా ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి కురుపాంలో స్వాగతం పలికారు. దుశ్శాలువతో సత్కరించారు. అలాగే జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్‌ను సత్కరించారు.

సత్కరించిన ఆర్యవైశ్యులు

సాలూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారిని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం ఆర్యవైశ్యులు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమెను ఆర్యవైశ్యుల సంఘ అధ్యక్షుడు మండవిల్లి సాంబశివరావు, ఉపాధ్యక్షుడు నాగసాయి తోపాటు కార్యవర్గ సభ్యులు సత్కరించారు. శ్యామలాంబ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అక్కేన అప్పారావు, ఉప్పల వెంకటేశ్వరరావు, ఇండుకూరి నారాయణరావు పాల్గొన్నారు.

పక్కా గృహాలు మంజూరు చేయాలి

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా గిరిజన ప్రాంతాల్లో గిరిజనులతో కలిసి నివసిస్తున్న ఓసీ, బీసీ, ఎస్సీ నిరుపేదలకు పక్కా గృహాలు మంజూరు చేసేలా చూడాలని ఏజెన్సీ కాపు సంఘం అధ్యక్షుడు కొనిశ మన్మథరావు ఆధ్వర్యంలో బీసీ నాయకులు మంత్రి సంధ్యారాణికి కోరారు. గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే జగదీశ్వరి ఇంటికి వచ్చిన మంత్రికి వారు ఈ మేరకు వినతిపత్రం అందించారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర



విద్యార్థినులతో థింసా నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం టౌన్/ బెలగాం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌వీడీ డిగ్రీ కళాశాల ఆవరణలో పీఎం ఉష కింద మంజూరైన బాలికల వసతి గృహం నిర్మాణానికి ఆర్జేడీ ఎస్.శోభారాణితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అంతకముందు ఎమ్మెల్యేకు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఘనం స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థినులతో కలిసి థింసా నృత్యం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అందులో భాగంగా జిల్లా కేంద్రంలో బాలికల కోసం ఎస్‌వీడీ కళాశాలలో రూ.5 కోట్లతో వసతి గృహం నిర్మిస్తున్నామని, రెండేళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో 26 జిల్లాలకు గాను 22 జిల్లాలకే పీఎం ఉష పథకం కింద బాలికల వసతి గృహాలు మంజూరు చేశారని, అందులో పార్వతీపురం జిల్లా ఉందని తెలిపారు. అనంతరం డిగ్రీ కళాశాలలో జరిగిన ఫేర్‌వెల్ కార్యక్రమానికి హాజరై విద్యార్థులను ఉద్దేశించి, మాట్లాడారు. అన్ని రంగాల్లో తమ సత్తా చాటి జిల్లా ప్రతిభను చాటాలని కోరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను ప్రిన్సిపాల్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బి.జయబాబు, కౌన్సిలర్లు మధు, కోరాడ నారాయణ రావు, బడే గౌరి నాయుడు తదితర నాయకులు పాల్గొన్నారు.

జ్వరాలు అదుపులోకి వచ్చేవరకు వైద్య శిబిరాలు



జ్వరాలపై ఆరా తీస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

భామిని, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నులకజోడు గ్రామంలో జ్వరాలు అదుపులోకి వచ్చే వరకు వైద్య శిబిరం నిర్వహిస్తామని డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతి సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆమె ఆ గ్రామాన్ని సందర్శించి, జ్వరాలపై ఆరా తీశారు. పదిమందికి రక్తపూతలు తీసినట్టు సిబ్బంది తెలిపారు. వారిలో ముగ్గురిని బత్తిలి పీహెచ్‌సీకి తరలించినట్టు చెప్పారు. తాగునీటి ట్యాంకర్లలో క్లోరినేషన్ చేయాలన్నారు. అనంతరం బత్తిలి పీహెచ్‌సీని సందర్శించి, రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆమెతో పాటు వైద్యాధికారులు దామోదర, రవీంద్ర పాల్గొన్నారు.

మహాత్ముడికి నివాళి

● ఘనంగా జ్యోతిబా పూలే జయంతి

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే అని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం ఆయన జయంతి సందర్భంగా జిల్లాలోని పలు చోట్ల వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. **(ఆంధ్రజ్యోతి బృందం)**



బెలగాం: జిల్లా పోలీస్ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న ఏఆర్ డీఎస్పీ థామస్‌రెడ్డి



గరుగుబిల్లి: పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు



కురుపాం: నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి

వీరఘట్టం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి పి.వీర్రాజు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణశాఖ, ఐసీడీఎస్, ఎస్‌డబ్ల్యూపీసీల నిర్వహణపై చర్చించారు. పల్లె పండుగ కార్యక్రమంలో మంజూరైన పనులను నాణ్యతా లోపం లేకుండా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.వెంకటరమణ, ఏపీవో జి.సత్యంనాయుడు, ఏపీఎం కె.రాము, ఎంఈవో ఆనందరావు, ఏవో సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

గరుగుబిల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలోని గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఒ.ప్రభాకర్ సూచించారు. మండలంలోని గొల్లవానివలస, గొట్టివలస, పెద్దూరులలో గృహనిర్మాణాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన సమయానికి పనులు పూర్తి చేసేలా దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం కొత్తపల్లి, రావుపల్లి గ్రామాల్లోని చెత్త సంపద కేంద్రాలను, గరుగుబిల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావు, గృహ నిర్మాణశాఖ ఇంజనీరింగ్ వి.అఖిల్‌నాయుడు, కార్యదర్శులు శిరీష, భార్గవ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏసు శిలువ యాత్ర కళ్లకు కట్టేలా..



ఏసుక్రీస్తు వేషధారణలో శిలువ యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

భామిని, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఏసు తపస్సు దీక్షలో భాగంగా భామిని పురవీధుల్లో శిలువ యాత్ర కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. బత్తిలి చర్చి ఫాదర్లు సంజీవ్, ప్రతాప్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఏసుక్రీస్తు శిలువ యాత్రను కళ్లకు కట్టేలా ప్రదర్శన చేశారు.

న్యూస్ బాక్స్

కబ్జాలో ఉన్న భూములను దళితులకు అప్పగించాలి

భామిని, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించిన డీపట్టా భూములను పెత్తందారుల కబ్జా నుంచి విముక్తి కల్పించి తమకు అందించాలని దళిత రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సీపీఎం నాయకులతో కలిసి శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. తహసీల్దార్ ఎన్.శివనారాయణకు తమ గోడు వినిపించారు. రైతుల భూ హక్కు పత్రాలు అందిస్తే సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.

ఘనంగా ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవం

వీరఘట్టం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని చలివేంద్రి గ్రామంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు జెండాను ఆవిష్కరించారు. సంఘం నాయకులు అలజంగి అప్పలస్వామి నాయుడు, కోడూరు శ్రీనివాసరావు, గర్భాన తవిటినాయుడు, సీమల అన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వంతెన పనుల పరిశీలన

సీతానగరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సువర్ణముఖి నదిపై జరుగుతున్న వంతెన పనులను క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ భాస్కరరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో ఎటువంటి నాణ్యతా లోపం ఉండకూడదని ఆదేశించారు. వంతెనలో వేస్తున్న మెటీరియల్‌పై ఆరా తీశారు. ఆయనతో పాటు డీఈ అప్పలరాజు, ఆర్అండ్‌బీ ఏఈ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

సీతంపేట రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎన్ఐఆర్డీ కన్సల్టెంట్ కె.నాగరాజు అన్నారు. శుక్రవారం సీతంపేట సచివాలయంలో పంచాయతీ లైన్ డిపార్ట్‌మెంట్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతంపేట పంచాయతీ అభివృద్ధి కోసం ప్రతినెల చేయాల్సిన కార్యక్రమాలపై వివరించారు. డీఎల్‌పీవో రాంప్రసాద్, డీఎల్‌డీవో గోపాలకృష్ణ, సర్పంచ్ కళావతి, ఈవోపీఆర్డీ సత్యం, కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.